సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 27 । మే । 2024



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

వైటాథాన్ పేరుతో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 8లో



జై హనుమాన్

సద్గురు సేవాశ్రమం వ్యవస్థాపకుడు కోన అప్పలరాజు ఏడేళ్ల పాటు 734 హనుమాన్ విగ్రహాలు ప్రతిష్టించారు. 8లో



నృత్య 'జాతర'

మధురవాడ శిల్పారామం జాతరలో ఆదివారం ఆధ్యాత్మిక, జానపద, కోలాట నృత్యాలు విశేషంగా అలరించాయి. 8లో

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం పరిశీలించారు. పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి పార్లమెంట్, అసెంబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన ఆయన భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీపీ-1గా లక్ష్మీనారాయణ



అల్లిపురం : నగర శాంతిభద్రతల డీసీపీ-1గా బి.లక్ష్మీనారాయణను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉండగా నగర పోలీస్ కమిషనర్‌కు అటాచ్ చేశారు. అంతకుముందు ఆయన ఇంటిలిజెన్స్ (సివిల్) ఎస్పీగా పనిచేశారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



ఆలస్యంగా రావడంతో విద్యార్థిని బయటే ఉంచేసిన సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష షీలానగర్‌లోని అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 570 మంది విద్యార్థులకు గాను 569 మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. నిర్ణీత సమయానికి హాజరుకాకపోవడంతో ఓ విద్యార్థిని పరీక్షా కేంద్రంలోకి నిర్వాహకులు అనుమతించలేదు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు.

3 నుంచి కథక్ నృత్య వర్క్‌షాప్

మద్దిలపాలెం: అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి, కొరియోగ్రాఫర్ అనురేఖా గోష్ చే విశాఖ వేదికగా వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు బత్తిన విక్రమ్ గౌడ్ తెలిపారు. విశాఖలో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌నకు హాజరు కావాలనే వారు ముందుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు కథక్ నృత్యంలో శిక్షణ ఇస్తారన్నారు. 10 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 98481 37445లో సంప్రదించాలని సూచించారు.

రంగస్థల కళాకారులకు సత్కారం



బిరుదులు అందుకున్న కళాకారులు రొంగలి శ్రీరాములు, విజయసారథితో నిర్వాహకులు

సీతంపేట: ప్రముఖ పౌరాణిక పద్య నాటక తెలుగు రంగస్థల కళాకారులు రొంగలి శ్రీరాములుకు అభినవ సౌభల, బగాది విజయసారథికి నట నక్షత్ర బిరుదులు ప్రదానం చేశారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్, పిల్లుట్ల ఆర్ట్స్ అకాడమి సంయుక్త నిర్వహణలో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కళాకారులు, సాహితీవేత్తల సమక్షంలో బిరుదులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ సెక్రటరి పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అఖిల భారత తెలుగు కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ చేతుల మీదుగా వీరిని సత్కరించారు.

కానుకలొచ్చేస్తున్నాయ్..!

- జిల్లాలోని 11 స్టాక్ పాయింట్లుకు చేరుతున్న విద్యాకానుక కిట్లు
- అక్కడ నుంచి నేరుగా పాఠశాలలకు సరఫరా
- బడి తెరిచిన రోజునే విద్యాకానుక అందజేత
- జిల్లాలో 77,567 మందికి ప్రయోజనం





సీతమ్మధార స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలు (ఇన్‌సెట్) ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా స్టాక్‌పాయింట్ చేర్చుతున్న కానుక సామగ్రి

విశాఖ విద్య : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు బడి తెరిచిన తొలిరోజునే 'విద్యాకానుక' అందించేలా ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. పేద విద్యార్థుల చదువులకు అండగా నిలవాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక అందజేస్తోంది. ఇప్పటికే నాలుగేళ్ల పాటు విద్యాకానుకను విద్యార్థులు అందుకున్నారు. పేద బిడ్డల చదువులకు ఆటంకం కలగకూడదనే ఉన్నతాశయంతో ముందుగానే నిధులు కేటాయింపు చేయటంతో వరుసగా ఐదో ఏడాది కూడా కానుక అందుకోనున్నారు. జిల్లాకు 6,80,758 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటికే 3,80,542 పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయి. వీటిని గాజువాకలో గల గోదాములో భద్రపరిచి అక్కడ నుంచి మండల స్టాక్ పాయింట్‌లకు సరఫరా చేస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 587 పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 77,567 మంది విద్యార్థులకు జూన్ 12న విద్యాకానుక అందించేలా విద్యాశాఖాధికారులు చకా చకా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్టాక్‌పాయింట్లలో భద్రం

వేసవి సెలవులు అనంతరం బడి తెరిచిన తొలిరోజునే(జూన్ 12) విద్యాకానుక కిట్లు అందజేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ నుంచి జిల్లాకు వచ్చే విద్యాకానుక వస్తువులకు మండల కేంద్రాలకు చేరవేస్తున్నారు. జిల్లాలో 11 మండల కేంద్రాల్లో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా విద్యాకానుక సామగ్రి అంతా ప్రస్తుతం స్టాక్‌పాయింట్లుకు చేరుతుంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు సరఫరా చేయగా, నేడో రేపో బ్యాగులు, నోట్ పుస్తకాలు రానున్నాయి. ఇలా వచ్చిన వస్తువులన్నింటినీ భద్రపరిచి, స్టాక్ పాయింట్లలోనే కిట్ రూపంలో సిద్ధం చేసి, ఇక్కడ నుంచి పాఠశాలలకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. మండల స్థాయిలో ఎంఈవో-2కు విద్యాకానుక కిట్లు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

కానుకలో తొమ్మిది రకాల వస్తువులు

తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక కిట్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రతీ కిట్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, మూడు జతల యూనీఫాం, ఒక జత షూతో పాటు రెండు జతల సాక్స్‌లు, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీ వంటి వస్తువులను బ్యాగ్‌లో పెట్టి విద్యార్థులకు అందజేయనున్నారు. ఒక్కో కిట్ కొనుగోలుకు రూ.1,667లను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇది బయట మార్కెట్‌లో రూ.5 వేలుకు పైగానే ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ విద్యాకానుక అందజేసే నిమిత్తం ఏడాదికి రూ.19 కోట్లును ప్రభుత్వం వెచ్చిస్తోంది.

విద్యార్థులందరికీ కానుక

2023–24 విద్యా సంవత్సరంలో యూ–డైస్‌లో నమోదైన విద్యార్థులను పరిగణలోకి తీసుకొని అంచనా వేసిన నివేదికల మేరకు జిల్లాకు విద్యాకానుక వస్తువులు సరఫరా అవుతున్నాయి. జిల్లాలో బాలురు 36,587 మంది, 40,980 మంది బాలికలు చదువుతున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో నేరుగా పాఠశాలలకే విద్యాకానుక కిట్‌లను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అప్పలనాయుడు, ఏఎంవో, సమగ్ర శిక్ష



రెండు రోజుల పాటు కురిసిన చిరు జల్లులు కాస్తా ఉపశమనం ఇచ్చిందని సంబర పడిపోతుంటే.. సూరీడు మాత్రం నిప్పులు కక్కుతూ నిలువెల్లా దహించేందుకు సిద్ధమైపోయాడు.. తుపాన్ వచ్చిందని సరదా పడితే.. ఆ తుపానే భానుడి ప్రతాపాన్ని మరింత పెంచేలా చేసేసింది. అకాల వర్షాల కారణంగా గాల్లో తేమనంతా తుపాన్ తుడిచిపెట్టుకుపోవడంతో విశాఖ ఉక్కపోతతో ఉడికిపోతోంది. రాబోయే రోజుల్లో స్టీల్ సిటీ కాస్తా.. సన్ సిటీగా మారిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

- 45 నుంచి 47 డిగ్రీలు నమోదయ్యే అవకాశం
- 'రోహిణి' ప్రభావం అంటున్న నిపుణులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వాతావరణ శాఖాధికారులు
- ఈ నెల 31 వరకూ ఇదే పరిస్థితి

సాక్షి, విశాఖపట్నం : భానుడి ప్రతాపాన్ని చూస్తుంటే.. ఈసారి విశాఖలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తుపాను ధాటికి గాల్లో తేమంతా మాయమైపోవడంతో పొడి వాతావరణం నెలకొంది. ఫలితంగా ఉక్కపోత ఓవైపు హడలెత్తిస్తుంటే.. నేటి నుంచి సూర్య ప్రతాపం కూడా పెరగనుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గతేడాది మొదలైన ఎల్‌నినో ప్రభావంతో ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ సంస్థ ముందుగానే హెచ్చరికలు జారీ చేసింది. అయితే.. అకాల వర్షాల ప్రభావంతో ఉష్ణోగ్రతల ప్రభావం ఊహించిన దానికంటే ఎక్కువగానే కనిపించనుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. సోమవారం నుంచి సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొన్నారు. అంటే.. విశాఖలో 45 నుంచి 47 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. అయితే.. ఉక్కపోత కారణంగా 50 డిగ్రీల వరకూ ఉండేలా అనిపిస్తుందని చెబుతున్నారు. తుపాను, రోహిణి కార్తె ప్రభావమే భానుడి ప్రతాపానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.



రుతుపవనాలు తాకితే చల్లారనున్న ఉష్ణతాపం

ఈసారి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. 31న భారత్‌లో ప్రవేశించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఈ కారణంగా ముందుగానే అనుకున్నట్లుగా జూన్ మొదటి వారం చివరలో లేదా రెండో వారం మొదట్లో తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించే అవకాశం ఉంది. రుతుపవనాలు రాకతో సూర్యుడి ప్రతాపం క్రమంగా తగ్గుముఖం పట్టనుందని భావిస్తున్నారు. సోమవారం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున విశాఖ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకి వెళ్లొద్దని సూచిస్తున్నారు. గాలి చెవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ, నీరు ఎక్కువగా తాగాలని సూచిస్తున్నారు.

అ'ద్వితీయ'ంగా..

ఆరోగ్య సురక్ష శిబిరాలు

- రికార్డు స్థాయిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ
- ప్రతి రోగికి వైద్యం, మందులు, వివిధ రకాల పరీక్షలు ఉచితం
- ఒక్కో శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులతో పాటు ఐదుగురు వైద్యులు
- మెరుగైన చికిత్స అవసరమైన రోగులను నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్
- 488 శిబిరాల ద్వారా 1,80,486 మంది రోగులకు వైద్య సేవలు



ఓపీ కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మహారాణిపేట: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. రెండో విడతలో భాగంగా ఊరూ వాడా ఏర్పాటు చేసిన శిబిరాలకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, అవసరమైన వైద్య సేవలు పొందారు. ఎన్నికల సమయంలో కూడా ఈ శిబిరాలు రోగులతో కిటకిటలాడాయి.

లక్ష్యానికి చేరువగా..

ఈ ఏడాది జనవరి 2వ తేదీ నుంచి ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి ఈ నెల 21(మంగళవారం) వరకు ఈ శిబిరాలు కొనసాగాయి. అర్బన్లో 551, రూరల్‌లో 54 కలిపి మొత్తం 605 వైద్య శిబిరాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతానికి అర్బన్లో 434, రూరల్‌లో 54 శిబిరాలు పూర్తయ్యాయి.

ఇంకా అర్బన్లో మాత్రమే 117 వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. వీటిని కూడా వీలైనంత వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన 488 వైద్య శిబిరాల ద్వారా లక్షా 80 వేల 486 మంది రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించారు.

అందుబాటులో మెరుగైన వైద్యం

సాధారణ వైద్య పరీక్షలకు అవసరమయ్యే పరికరాలతోపాటు, స్పెషలిస్టు వైద్య సేవలు కూడా ఈ వైద్య శిబిరాల్లో అందిస్తున్నారు. ప్రతి శిబిరంలో ఈసీజీ, బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, కఫం, డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా తదితర 9 రకాల వైద్య పరీక్షలు, 175 రకాల మందులు అందుబాటులో ఉంచారు. జనరల్ ఫిజీషియన్, డెంటల్, గైనిక్, పిల్లల వైద్యులు, కంటి వైద్యుడితోపాటు నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొని, ప్రతి రోగికి అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యం కోసం పట్టణాలు, జిల్లా కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పనిలేకుండా తమ నివాసాలకు దగ్గర్లోనే మెరుగైన వైద్య సేవలు అందడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేటగిరీల వారీగా వైద్య సేవలు పొందిన రోగులు

కంటి సంబంధిత రోగులు	19,652
కళ్లద్దాలకు రిఫరెన్స్	8,273
కేటరాక్ట్ చికిత్సకు రిఫరెన్స్	1,460
ఆర్థోపెడిక్	18,587
గైనిక్	8,666
పీడియాట్రిక్	9,450
డెంటల్	9,651

(మిగిలినవి జనరల్ ఫిజీషియన్ సేవలు)

మొత్తం వైద్య శిబిరాల లక్ష్యం	605
అర్బన్ లక్ష్యం	551
ఏర్పాటు చేసినవి	434
రూరల్ లక్ష్యం	54
ఏర్పాటు చేసినవి	54
మొత్తం ఓపీ సేవలు	1,80,486
అర్బన్ ఓపీలు	1,54,074
రూరల్ ఓపీలు	26,412

నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన కేసులు 749 (అర్బన్ 635, రూరల్ 114)

ప్రజల ఆదరణ బాగుంది



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి, తమ ఆరోగ్య సమస్యలకు వైద్యం పొందారు. సెలవు రోజుల్లో మినహా మిగిలిన అన్ని రోజులూ వైద్య శిబిరాలు నిర్వహించాం. శిబిరానికి వచ్చే రోగులకు అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సతో పాటు, ఉచిత మందులు కూడా అందిస్తున్నాం. మెరుగైన చికిత్స అవసరమయ్యే రోగులను నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, విశాఖపట్నం

31వ తేదీలోగా కౌంటింగ్ ఏజెంట్లు పేర్లు ఇవ్వాలి

మహారాణిపేట: వచ్చేనెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం ఈనెల 31వ తేదీలోగా అభ్యర్థులు తమ ఏజెంట్ల జాబితాను రిటర్నింగ్ అధికారులకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కొక్క టేబుల్‌కు ఒక్కో ఏజెంటును నియమిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 14 మంది ఏజెంట్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమిస్తారు.

ఏజెంట్లుగా ఉండాలంటే..

- 18 ఏళ్ల నిండిన వ్యక్తులను తమ ఏజెంట్లగా అభ్యర్థులు నియమించుకోవచ్చు.
- భారత పౌరసత్వం ఉన్న ఎన్నారైలు కూడా ఏజెంట్లగా ఉండొచ్చు
- సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఏజెంట్లగా వెళ్లడానికి అనుమతి ఉంటుంది.
- కౌంటింగ్ హాలులోకి అభ్యర్థిని లేదా చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌ను అనుమతి ఇస్తారు.
- ఏజెంట్లను హాలు బయట ఉంచుతారు.
- ఏజెంట్లకు అవసరమైన ఆహారం కూడా అభ్యర్థే భరించాలి
- కౌంటింగ్ హాలులో టేబుళ్లకు అనుగుణంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి.

వారికి అనుమతి లేదు

- ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకొనే వారు కౌటింగ్ ఏజెంట్లగా అనర్హులు
- మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్, జిల్లా పరిషత్ చైర్మన్లు, ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే వారు, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు ఏజెంట్లగా ఉండకూడదు
- ప్రభుత్వ ఉద్యోగులు ఏజెంట్లగా వ్యవహరించినట్టు తేలితే శిక్షార్హులవుతారు.
- వీరికి 3 నెలల జైలు శిక్ష లేదా,జరిమానా, ఒక్కోసారి రెండు కలిపి విధించే అవకాశం ఉంది.

డీ -ఫార్మసీతో ఉపాధికి భరోసా

- 8 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్ 35 ప్రైవేటు పాలిటెక్నిక్‌లో కోర్సు
- కోర్సు వ్యవధి రెండేళ్లు

మురళీనగర్: ఇంటర్మీడియట్ అనంతరం ఫార్మసీ రంగంలో శిక్షణ పొందేందుకు డిప్లమా ఇన్ ఫార్మసీ కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతో పాటు కొన్ని ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో కూడా నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు చేసిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో ఫార్మసీ కంపెనీలతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగం ఆస్పత్రుల్లోనూ ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఈ కోర్సు పూర్తి చేసిన వారు తక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లాంటి కాలేజీల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

కోర్సు కాల వ్యవధి:

రెండేళ్లు. అనంతరం మూడు నెలల ప్రభుత్వ ఆస్పత్రిలో శిక్షణ ఉంటుంది.

విద్యార్హత:

ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా బైపీసీ, నేషనల్/ స్టేట్ ఓపెన్ స్కూల్ లో ఇంటర్మీడియట్ ఎంపీసీ లేదా బైపీసీ, సీబీబీఎస్ఈ /ఐసీఎస్ఈ బోర్డు ద్వారా ఇంటర్మీడియట్‌కు సమానమైన పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.

https:// apsbtet.in/ pharmacy వెబ్‌సైట్లో నేరుగా జూన్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 21 నుంచే దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది.

ఎంపిక విధానం:

కోర్సులో శిక్షణకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మార్కుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ నిర్ణయం మేరకు మెరిట్ ప్రాతిపదికగా ర్యాంకులు కేటాయిస్తారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు అవకాశాలను బట్టి కళాశాలలను ఎంపిక చేసుకోవచ్చు.

కళాశాలల వివరాలు

రాష్ట్రంలో 8 ప్రభుత్వ కళాశాలలు, ఒక ఎయిడెడ్ కళాశాల 35 ప్రయివేటు కాలేజీలు ఉన్నాయి. కోస్తాంధ్రలో విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ , శ్రీకాకుళం, కాకినాడ, గుంటూరు మహిళా పాలిటెక్నిక్, రాయలసీమలో తిరుపతి, కర్నూలు ప్రభుత్వ పాలిటెక్నిక్, కడప, హిందూపూర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా ఎయిడెడ్ పాలిటెక్నిక్.

పాఠ్యాంశాలు

ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ప్రథమ సంవత్సరంలో ఐదు సబ్జెక్టులు, రెండో సంవత్సరంలో ఆరు సబ్జెక్టులతో పాటు కోర్సులో భాగంగా మందులు తయారు చేయడం, మానవ శరీర అవయవాల మీద మందులు పని చేసే విధానం, ఔషధ మొక్కలు, ఫార్మసీ చట్టాలపై అవగాహన, ఫార్మసిస్టుగా డ్రగ్స్ డిస్పెన్సింగ్, పేషంట్ కౌన్సిలింగ్‌లో అవగాహన కల్పిస్తారు. రెండేళ్ల కోర్సులో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు ప్రాక్టికల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రెండు నెలలు కోర్సు పూర్తి చేసిన అనంతరం మూడు నెలలు ప్రయివేటు ఆస్పత్రుల్లో శిక్షణ ఇస్తారు.



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫార్మసీ కాలేజీ



ప్రయోగశాలలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

ఉపాధి అవకాశాలు

డిప్లమా ఇన్ ఫార్మసీ పూర్తి చేసిన వెంటనే ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్యశాలలు, పరిశ్రమలు, రైల్వే ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రిలో కమ్యూనిటీ ఫార్మసిస్ట్, హాస్పిటల్ ఫార్మసిస్ట్, మార్కెటింగ్ డ్రగ్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఔషధ దుకాణాలలో రిటైల్ ఫార్మసిస్టులుగా ఉద్యోగాలు ఉన్నాయి. ఫార్మస్యూటికల్ కంపెనీల్లో ఫార్మసీ సూపర్‌వైజర్, ఫార్మసిస్టు ఉద్యోగాలు పొందవచ్చు. ఆర్థిక స్తోమత ఉన్నవారు సొంతంగా మెడికల్ షాపు ఏర్పాటు చేసుకొని తనతోపాటు మరి కొంతమందికి ఉపాధి కల్పించవచ్చు. ఈ రంగంలో వేతనాలు అధికంగా ఉన్నందున ఎక్కడైనా ఉపాధికి భరోసా ఉండడంతో కోర్సుకు డిమాండ్ ఎక్కువగా ఉంది. డి.ఫార్మసీ కోర్సు చదివిన తర్వాత ఉన్నత చదువులకు ఈసెట్ ద్వారా బి. ఫార్మసీ రెండో సంవత్సరంలోకి చేరవచ్చని, ఫీజు రీయింబర్స్‌మెంటు వర్తిస్తుందని కంచరపాలెం ఫార్మసీ హెడ్ జె.గోవర్ధనరావు తెలిపారు.

అత్యుత్తమ బోధన



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1966లో ఫార్మసీ డిప్లమా కోర్సు ప్రారంభించారు. ఇక్కడ 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం ఉంది. మా కాలజీలో చదివిన విద్యార్థులు ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ కంపెనీలలో ఉపాధి పొందుతున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి క్యాంపస్ డ్రైవ్‌లో 39 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఏడుగురు విద్యార్థులు ఉన్నత విద్య కోసం వెళ్తున్నారు. మాదగ్గర అధునాతన ప్రయోగశాల, ఉన్నత అర్హతలు కలిగిన ఫ్యాకల్టీ ఉంది. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉపాధి, ఉన్నత విద్యకు ఈ కోర్సులో చేరడం ఉత్తమం.

–డాక్టర్ కె.నారాయణరావు, ప్రిన్సిపాల్, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్

ఆకట్టుకునేలా మహీంద్రా 3X0


వినియోగదారుడికి కీ అందిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: చూపరులను ఆకట్టుకునేలా మహీంద్రా 3 XO వాహనం ఉందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కొనియాడారు. ఆదివారం ఆమె నగరంలోని విశాలాక్షినగర్‌లోని మహీంద్రా ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చరర్ ఆవరణలో ఆ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం 10 మంది వినియోగదారులకు వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్‌ను కంపెనీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

శిల్పారామంలో నృత్య 'జాతర'


ఆకట్టుకున్న జానపద నృత్యం

మధురవాడ: ఆధ్యాత్మిక, జానపద, కోలాట నృత్యాలు విశేషంగా అలరించాయి. మధురవాడ శిల్పారామం జాతరలో ఆదివారం నృత్యాలతో సందడిగా మారింది. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం విశాఖకు చెందిన శ్రీ ముత్యాలమ్మ కోలాట గ్రూపు వారిచే కోలాటం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. రామ.. రామ.. రామ..., జయ జనార్ధన, నిన్ను గని, శిర్డీ సాయి నువ్వే మా దైవం తదితర నృత్యాలు, అరకు ధింసా, మొక్క జొన్న తోటలో, వదినకు ఒకసరి తదితర జానపద నృత్యాలకు కళాకారులు చక్కని అభినయంతో చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులు రమ్య, లక్ష్మి, భవాని, సత్య, పూర్ణిమ, అరుణ, రాధ, కొండ, అఖిల, మహాలక్ష్మి తదితరులు కె. మురళి గోవింద్ నృత్య దర్శకత్వంలో ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమాలను పరిపాలనాధికారి టి. విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 383 కేసుల నమోదు

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ సీపీ డాక్టర్ ఫకీరప్ప ఆధ్వర్యంలో శనివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. జోన్-1, జోన్-2 పరిధిలో 75 బృందాలను ఏర్పాటు చేసి నగరంలో పలు ప్రాంతాలలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 383 మంది వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు. జోన్-1 పరిధిలో ఫోర్ వీలర్స్-17, టూ వీలర్స్-148, ఆటోలు -17 మొత్తంగా 183 మంది వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు.జోన్-2 పరిధిలో టూ వీలర్స్ 175, ఆటోలు-10, ఫోర్ వీలర్స్-14తో పాటు ఒక కమర్షియల్ వాహనంతో పాటు మొత్తంగా 200 వాహనచోదకులపై కేసులు నమోదు చేశారు.

జై హనుమాన్


మన్యంలో ప్రతిష్ఠించిన హనుమ విగ్రహం

- ఏడేళ్లలో 734 హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ
- వెయ్యి ప్రతిష్ఠించాలని లక్ష్యం
- సద్గురు సేవాశ్రమం వ్యవస్థాపకుడు అప్పలరాజు ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ



రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం


చేపలుప్పాడలో ప్రతిష్ఠించిన సాయిబాబా, ఆంజనేయుని విగ్రహాలు


ప్రతిష్ఠించడానికి సిద్ధంగా హనుమ విగ్రహం


జీకే వీధి రింతాడ వద్ద నిర్మించిన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు నిడిగట్టు సమీపంలోని రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన సద్గురు సేవాశ్రమం వ్యవస్థాపకుడు కోన అప్పలరాజు అలియాస్ యోగారాజు ఏడేళ్ల పాటు అలుపెరగకుండా 734 హనుమాన్ విగ్రహాలు ప్రతిష్ఠించారు. వీటిలో 650కు పైగా విగ్రహాలు విశాఖ ఉమ్మడి జిల్లా మన్యంలోనే ప్రతిష్ఠించారు. ఇవి పాడేరు, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, హుకుంపేట, అరకు, పెదబయలు, చింతపల్లి, అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, కేడీ పేట, కొయ్యూరు మండలాలతో పాటు ఒడిశాలోని మల్కన్‌గిరి కోరాపుట్ జిల్లాల్లో కూడా మారుతి విగ్రహాల ప్రతిష్ఠ ద్వారా గిరిజనులలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. దాతల సాయంతో కొనసాగుతున్న ఈ మహాయజ్ఞం వెయ్యి విగ్రహాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో యోగా రాజు ముందుకు సాగుతున్నారు. వీటి కోసం ఆయన ఇప్పటి వరకు రూ.2.50 కోట్లు మించి ఖర్చు చేసినట్టు అంచనా. కేవలం ఆంజనేయుని విగ్రహాలే కాకుండా వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయి, శివపార్వతులు, గణపతి తదితర విగ్రహాలు, వాటికి ఆలయాలు నిర్మిస్తున్నారు. రెండేళ్ల క్రితం అల్లూరి జిల్లా జి.మాడుగులలో రూ.50 లక్షలతో 15 అడుగుల పంచముఖ ఆంజనేయుని విగ్రహంతో పాటు ఆలయాన్ని నిర్మించారు. ఇకపై మైదాన ప్రాంతాలకు కూడా ఈ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. మన్యంలోని మారుమూల గ్రామాలైన తమ్మింగల, భీమనపల్లి, సోమవరం, ఉకురుబ, ములుసోబ, కొరాపల్లి, వందనపల్లి, వట్టివెగిస, సాడీకు, గెమ్మిలి, అన్నవరం వంటి గ్రామాలు కూడా ఉన్నాయి. గ్రామ జనాభాను బట్టి 3 నుంచి 15 అడుగుల రాతి, సిమెంట్ విగ్రహాలు ఇందులో ఉన్నాయి. వీటి కోసం రూ.10 వేల నుంచి రూ.లక్షలలో ఖర్చు చేస్తున్నారు. అదనంగా ఆలయాల నిర్మాణానికి మరిన్ని నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇతర ఆలయాలు ఉన్నచోట అనుబంధంగా భజరంగబలి విగ్రహాలు అందిస్తున్నారు. అంతేకాకుండా భీమిలి పరిధిలోని అన్నవరం, చేపలుప్పాడ, కాపులుప్పాడ, నిడిగట్టు చుట్టుపక్కల గ్రామాల్లో పదుల సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెంలో రూ.1.50 లక్షలతో నిర్మించిన 15 అడుగుల విగ్రహం పెద్దది. 2017 ఏప్రిల్‌లో అక్షయ తృతీయ రోజు తండ్రి కుంచయ్య జ్ఞాపకార్థం 9 అడుగుల మొదటి విగ్రహాన్ని హుకుంపేట మండలం సుకురుపేట పంచాయతీ రాళ్లగడ్డలో ప్రతిష్ఠించారు.

రాళ్లకు ప్రత్యామ్నాయంగా..

మన్యంలోని మారుమూల గ్రామాల్లో ఆలయాలు తక్కువగా ఉండటంతో గిరిజనులు రాళ్లను పూజిస్తుంటారు. దీంతో వారి కోరిక మేరకు ప్రతిష్ఠించిన విగ్రహాలు వందలకు చేరుకుని వెయ్యి విగ్రహాల లక్ష్యంగా సాగుతోంది. విగ్రహాలు కావలసిన వారు నాలుగు అడుగుల ఎత్తులో 6×6 విస్తీర్ణంతో దిమ్మె నిర్మించుకుంటే సేవాశ్రమం నుంచి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం ఆంజనేయుని విగ్రహాలే కాకుండా హుకుంపేట మండలం మద్దివీధిలో రూ.3.50లక్షలతో శివాలయం పునఃప్రతిష్ఠ, ములుసోబలో అయిదడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ఇంట్లో పూజలకు అడుగు సైజు రాతి ఆంజనేయుని విగ్రహాలు ఇస్తున్నారు. విగ్రహం ప్రతిష్ఠించిన రోజు స్థానికులు అన్నదానాలు ఏర్పాటు చేసుకుంటున్నారని అక్కడకు హాజరైన వారికి ఆశ్రమం తరపున రామకోటి పుస్తకాలు, ఆంజనేయుని చిత్రపటాలు, దుప్పట్లు, చీరలు, స్టీలు కంచాలు అందిస్తున్నామన్నారు. విగ్రహాల తయారీ ఏజెన్సీ ముఖద్వారమైన చోడవరం, వడ్డాది, ఆర్లాపురం, ముకుందపురం, రాజమండ్రిలలో చేపట్టి ఇక్కడ నుంచే అతి కష్టంమీద వాహనాలలో ఏజెన్సీకి తరలిస్తుంటారు.

నిత్య సేవకుడు యోగారాజు

ఏజెన్సీలో 500 దేవాలయాలకు విడతకు రూ.2.25 లక్షల వంతున పూజాసామాగ్రి ఆశ్రమం తరపున పంపిణీ చేశారు. భీమిలి మండలం చేపలుప్పాడలో షిర్డీసాయిబాబా విగ్రహం, రామయోగి అగ్రహారంలో షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం, నూకాంబిక, శ్రీకృష్ణులకు మందిరాలు నిర్మించారు. ఇక్కడే వంద వరకు దేశీయ ఆవులతో గోశాల, 60 మంది వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించారు. విజయసాయి యోగా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యోగాలో ఉచిత శిక్షణ, నేత్ర వైద్యశిబిరాలు, తాగునీటి కొరత ఉన్నచోట బోర్ల తవ్వకాలు, వంటపాత్రలు పంపిణీ చేస్తున్నారు. గతంలో చింతపల్లి, రోలుగుంట గ్రామాల్లో రూ.1.25 లక్షలతో మోటార్లు, పైపులైన్, టాంకర్ల ద్వారా అక్కడి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారు.

వెయ్యి విగ్రహాలు పూర్తి చేస్తాం



విజయప్రదాత అంజనిసుతుని ఆశీస్సులతో వెయ్యి విగ్రహాలు పూర్తి చేయడమే లక్ష్యంగా దాతల సాయంతో ముందుకు వెళ్తున్నాం. విగ్రహాలు కావలసిన వారు 98486 49067, 85005 09067 నంబర్లలో సంప్రదించవచ్చు.

– యోగా రాజు

కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం


జంబో డ్యాన్స్ చేస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: వైటాథాన్ పేరుతో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం కంటి క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ఈ అవగాహన ర్యాలీని రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్‌ను జయించిన వనుము చంద్రశేఖర్, అర్జున్ అవార్డు గ్రహీత జయరామ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి హెడ్ డాక్టర్ వీరేందర్ సచ్‌దేవా మాట్లాడుతూ ప్రజలు కంటి క్యాన్సర్ సాధారణ లక్షణాల గురించి తెలుసుకోవటం, సకాలంలో వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. రెటినోబ్లాస్టోమా అత్యంత సాధారణ లక్షణం వైట్ రిఫ్లెక్స్ అని తెలిపారు. వైట్ రిఫ్లెక్స్ అనేది తెల్లటి లేదా పసుపు తెలుపు కాంతి... పిల్లల కంటిపై కాంతి పడినప్పుడు, ఫ్లాష్‌తో ఫొటో తీసినపుడు కళ్లు సరిగా కనిపించకపోవటం, ఎర్రబడటం, మెల్లకన్ను వంటి ఇతర లక్షణాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా జంబో డ్యాన్స్ చేసి అలరించారు. ఈ వైటాథాన్‌లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ భవనాల పరిశీలన


వీఎంఆర్‌డీఏలో పలు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సిరిపురం వీఎంఆర్‌డీఏ భవన నిర్మాణ పనులు, ఇతర భవనాలను ఆదివారం కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున పరిశీలించారు. అక్కడ అధికారులను పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే భవనాల మరమ్మతుల గురించి చర్చించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్‌ఈ భవాని శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టీ షిప్ బిల్డింగ్ యార్డ్ సందర్శన


యుద్ధనౌకల నిర్మాణ ప్రాజెక్ట్‌ల స్థితిగతులను రాజేష్ పెంధార్కర్‌కు వివరిస్తున్న ఎల్‌అండ్‌టీ సిబ్బంది

సింథియా : తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఆదివారం చెన్నై సమీపంలోని కట్టుపల్లిలో గల ఎల్‌అండ్‌టీ షిప్ బిల్డింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ప్రస్తుతం యుద్ధనౌకల నిర్మాణ ప్రాజెక్ట్‌ల స్థితిగతులను, యార్డ్ సామర్థ్యాన్ని ఆయనకు వివరించారు.

పోటెత్తిన భక్తజనం


మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి తరలివచ్చిన భక్తులు, విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

- మోదమ్మ పాదాల గుడివద్ద దర్శనానికి బారులు
- ప్రత్యేక వాహనాల్లో రాక
- కిలోమీటరు పొడవునా నిలిచిపోయిన ట్రాఫిక్
- క్రమబద్ధీకరించిన పోలీసులు

సాక్షి,పాడేరు: ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో సుమారు కిలోమీటరు పొడవునా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఉదయం 6గంటల నుంచి మోదమ్మతల్లి పాదాలు గుడికి భక్తుల తాకిడి నెలకొంది. అమ్మవారి ఇంటి పండగలను జరుపుకున్నారు. పసుపు, కుంకుమలతోపాటు ఘటాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పూజలు అనంతరం భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని కుటుంబాలు, బంధుమిత్రులతో సాయంత్రం వరకు గడిపారు.

నూకాంబిక ఆలయం కిటకిట


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో పిల్లాపాపలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బొర్రా కిటకిట


ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. గత రెండురోజుల నుంచి భారీగా తరలివస్తున్నారు. గుహలను శనివారం 3,600 మంది తిలకించగా రూ.2.88 లక్షలు, ఆదివారం 4,700 తిలకించగా 3.82 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. – అనంతగిరి

మురిసిన పర్యాటకం


గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట కాఫీతోటల సందర్శనకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబసమేతంగా విచ్చేసి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. చల్లని వాతావరణంలో రోజంతా గడిపారు. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో అరకు–విశాఖ ఘాట్‌రోడ్డు రద్దీగా మారింది. – అరకులోయ రూరల్